క్లుప్తంగా

ఉచిత ఒడుగుల కార్యక్రమానికి స్పందన



ఒడుగుల కార్యక్రమంలో మంత్రి ఫరూక్

నంద్యాల(వ్యవసాయం): పట్టణంలోని చాంద్ బాడలో డాక్టర్ బాబన్ ఆధ్వర్యంలో పేద ముస్లిం పిల్లలకు మంగళవారం నిర్వహించిన ఉచిత ఒడుగుల(ఖత్నా) శస్త్ర చికిత్స శిబిరానికి విశేష స్పందన లభించింది. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా న్యాయశాఖ మంత్రి ఎన్ఎండీ ఫరూక్ పాల్గొని శిబిరాన్ని ప్రారంభించారు. శిబిరంలో 200 మంది చిన్నారులకు ఖత్నా నిర్వహించారు. కార్యక్రమంలో దూదేకుల సంక్షేమ సంఘం అధ్యక్షుడు దస్తగిరి, వాసవీ దస్తగిరి, హుసేనప్ప, షేక్షావలి, సోమశేఖర్, సీడ్స్ బాబు తదితరులు పాల్గొన్నారు.

రేపు ఆలయ భూములకు వేలం

నంద్యాల(వ్యవసాయం): పట్టణంలోని బ్రహ్మనందీశ్వరస్వామి, కాళికాంబ చంద్రశేఖరస్వామి ఆలయ భూములు, షాపులకు బహిరంగ వేలం పాట నిర్వహిస్తున్నట్లు ఆలయ ఈఓ లక్ష్మీనారాయణ తెలిపారు. ఈ నెల 20వ తేదీ మధ్యాహ్నం 3 గంటలకు ఆలయ ఆవరణలో వేలం పాట జరుగుతుందని చెప్పారు. ఆసక్తి ఉన్న వారు రూ.2 వేలు డిపాజిట్ చెల్లించి పాల్గొనాలన్నారు. మూడేళ్ల కాలపరిమితికి కౌలుకు ఇవ్వనున్నట్లు పేర్కొన్నారు. అదే విధంగా శ్రీకాళికాంబ చంద్రశేఖరస్వామి దేవస్థానం షాపులకు ఉదయం 10 గంటలకు బహిరంగ వేలం పాట నిర్వహిస్తున్నట్లు తెలిపారు. పాటదారుడు రూ.5 వేలు డిపాజిట్ చెల్లించి పాల్గొనాలన్నారు. షాపుల అద్దె కాలం మూడేళ్ల వరకు ఉంటుందన్నారు.

ప్రజలకు అందుబాటులో లేకుంటే చర్యలు



రేషన్ వాహనదారుడితో మాట్లాడుతున్న మున్సిపల్ కమిషనర్ నిరంజన్ రెడ్డి

నంద్యాల(సిటీ): పట్టణంలో విధులు నిర్వర్తిస్తున్న సచివాలయ సిబ్బంది ప్రజలకు అందుబాటులో ఉండాలని.. లేకుంటే చర్యలు తప్పవని మున్సిపల్ కమిషనర్ నిరంజన్ రెడ్డి అన్నారు. మంగళవారం పట్టణంలోని పలు ప్రాంతాలను పరిశీలించారు. వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో పారిశుద్ధ్య పనులపై దృష్టి సారించాలన్నారు. ఎక్కడా నీరు నిల్వ లేకుండా చూడాలన్నారు. ముఖ్యంగా బ్లాక్ హోల్ ప్రాంతాల్లో నిత్యం పారిశుద్ధ్య పనులు చేయాలని ఆదేశించారు. సాయంత్రం 34వ వార్డులో పర్యటించి రేషన్ వాహనాల ద్వారా ప్రజలకు అందుతున్న నిత్యావసర వస్తువుల గురించి ఆరా తీశారు. అర్హులందరికీ తప్పనిసరిగా సరుకులు అందించాలన్నారు.


రేపు కేంద్ర బృందం పర్యటన

దొర్నిపాడు: 2023-2024 రబీ సీజన్‌లో నెలకొన్న కరువు పరిస్థితులను తెలుసుకునేందుకు కేంద్ర ప్రభుత్వానికి చెందిన ఇంటర్ మినిస్ట్రీరియల్ టీం గురువారం వస్తున్నట్లు మండల వ్యవసాయాధికారి సునీత మంగళవారం తెలిపారు. రబీలో 3,156 హెక్టార్లలో పంటనష్టం వాటిల్లిందన్నారు. 1,503 హెక్టార్లలో శనగ, 1,626 హెక్టార్లలో జొన్న, 140 హెక్టార్లలో మినుము, 30 హెక్టార్లలో వరి, ఇతర పంటలు 8 హెక్టార్లలో నష్టం జరిగిందని తెలిపారు. పరిశీలనకు వచ్చే అధికారులకు స్థానిక రైతులు సహకరించాలని కోరారు.

22న మండల సర్వసభ్య సమావేశం

శిరివెళ్ల: మండల సర్వ సభ్య సమావేశం ఈ నెల 22వ తేదీన నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ ఫణి రాజకుమారి మంగళవారం తెలిపారు. ఎంపీపీ నాయక్ వసీం అధ్యక్షతన జరగనున్న సమావేశంలో తాగునీరు, పారిశుద్ధ్యం, విద్యా, వైద్యం, గ్రామీణ, రవాణా, వ్యవసాయం తదితర శాఖలపై చర్చ జరుగుతుందన్నారు. ఆయా శాఖల అధికారులు, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, పంచాయతీ కార్యదర్శులు తప్పనిసరిగా హాజరు కావాలని సూచించారు.

పారిశుద్ధ్యంపై దృష్టి సారించండి



సమావేశంలో మాట్లాడుతున్న శ్రీనివాస శర్మ

రుద్రవరం: మండలంలోని 21 గ్రామ పంచాయతీలు, మజరా గ్రామాల్లో పారిశుద్ధ్యం లోపించకుండా చర్యలు తీసుకోవాలని ఈఓపీఆర్డీ శ్రీనివాస శర్మ పంచాయతీ కార్యదర్శులకు సూచించారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో మంగళవారం పంచాయతీ కార్యదర్శులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. వర్షా కాలం కావడంతో నీటినిల్వ లేకుండా చూడాలన్నారు. అలాగే మురుగు కాల్వలను శుభ్రం చేయించాలని చెప్పారు.



ఉయ్యాలవాడ చేపల చెరువు కట్టతెగి ప్రవహిస్తున్న వర్షపు నీరు



మాచినేనిపల్లెలో నీటిలో మునిగిన మొక్కజొన్న పంట



భాగ్యనగరం వద్ద నీట మునిగిన మినుము పంట



దొర్నిపాడు వద్ద పొలాల్లో నుంచి కాల్వలోకి పారుతున్న వర్షపునీరు

ముంచెత్తిన వర్షం

- పొంగిపొర్లిన వాగులు, వంకలు
- కుంటలను తలపిస్తున్న పంటపొలాలు
- ఉధృతంగా ప్రవహించిన కుందరవాగు... స్తంభించిన రాకపోకలు

ఉయ్యాలవాడ : మండలంలో మంగళవారం వర్షం ముంచెత్తింది. తెల్లవారుజామున 3 గంటల నుంచి ఉదయం 7 గంటల వరకు ఎడతెరిపి లేకుండా భారీ వర్షం కురిసింది. నంద్యాల జిల్లాలోనే అత్యధికంగా ఉయ్యాలవాడలో 109.6 మి.మీ వర్షపాతం నమోదైంది. వాగులు, వంకలు పొంగిపొర్లాయి. పొలాలు వర్షపు నీటితో కుంటలను తలపించాయి. మాయలూరు, ఆళ్లగడ్డ ఆర్అండ్‌బీ రహదారిలో ఇంజేడు గ్రామ సమీపంలో ఉన్న కుందరవాగుపై వర్షపు నీరు ఉధృతంగా ప్రవహిస్తుండడంతో రాకపోకలు స్తంభించాయి. ఆళ్లగడ్డ, నంద్యాల తదితర పట్టణ ప్రాంతాలకు వెళ్లే ప్రజలు, ఉద్యోగులు, వ్యాపారులు ఇబ్బందులు పడ్డారు. ఖరీఫ్ సాగుకు అనుగుణంగా వర్షం పడిందని రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. రెండు రోజులుగా ఎండ తీవ్రత, వడగాల్పులతో ప్రజలు ఉక్కపోతతో అల్లాడిపోయారు. ఒక్క సారిగా భారీ వర్షం కురవడంతో వాతావరణం పూర్తిగా చల్లబడింది.

నీరు వెళ్లే మార్గం లేక విద్యార్థుల అవస్థలు

చిన్నపాటి వర్షం కురిసినా స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణ మడుగును తలపిస్తోంది. నీరు బయటకు వెళ్లేందుకు మార్గం లేక నిలిచిపోయింది. వర్షపు నీరు వెళ్లేందుకు మండల పరిషత్ కార్యాలయం ఎదుట ఉన్న కల్వర్టు కూడా మట్టితో పూడిపోయింది. దీంతో వర్షపు నీరు రోడ్డుపై పారుతోంది. విద్యార్థులు తరగతి గదుల్లోకి వెళ్లేందుకు కూడా మార్గం లేక అవస్థలు పడ్డారు. వర్షపు నీరు బయటకు పంపేందుకు చర్యలు చేపట్టాలని విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు.



ఉయ్యాలవాడ ఉన్నత పాఠశాల ఆవరణ వర్షపునీటితో నిండిపోగా వెళ్లేందుకు ఇబ్బందులు పడుతున్న విద్యార్థులు

దొర్నిపాడు: మండలంలో మంగళవారం తెల్లవారుజాము నుంచి ఉదయం వరకు భారీ వర్షం కురిసింది. దీంతో వాగులు వంకలు పొంగిపొర్లాయి. దొర్నిపాడు, కొండాపురం, భాగ్యనగరం, రామచంద్రాపురం గ్రామాల్లో మిమును పంట నీట మునిగింది. మండలంలో 44.2మి.మీ వర్షపాతం నమోదు అయినట్లు అధికారులు పేర్కొన్నారు. ఖరీఫ్ ఆరంభంలోనే విరామం లేకుండా వర్షాలు కరుస్తుండటంతో రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

రుద్రవరం: మండలంలో మంగళవారం తెల్లవారుజాము నుంచి ఉదయం వరకు వర్షం కురిసింది. పంట పొలాలు నీట మునిగాయి. వాగులు, వంకల్లో నీరు ఉధృతంగా పారింది. మండల కేంద్రమైన రుద్రవరంతోపాటు కొండమాయపల్లె, టీ.లింగదిన్నె, నర్సాపురం, ఆలమూరు, ముకుందాపురం, పెద్దకంబలూరు, ఎల్లావత్తుల, బి.నాగిరెడ్డిపల్లె, మాచినేనిపల్లె తదితర గ్రామాల్లోని పలు కాలనీలు జలమయం అయ్యాయి. ఇటీవల సాగు చేసిన మినుము, మొక్కజొన్న, పత్తి, మిరప పంటలు నీట మునిగాయి.



జలదిగ్బంధంలో పడకండ్ల-అహోబిలం రహదారి

ఆళ్లగడ్డ: ఆళ్లగడ్డ నియోజకవర్గం వ్యాప్తంగా మంగళవారం తెల్లవారు జామున భారీ వర్షం కురిసింది. దీంతో వాగులు, వంకలు ఉప్పొంగిపొర్లాయి. కుంటలు, చెరువులు నిండడంతో జలకళ ఉట్టిపడుతోంది. అలాగే మున్సిపల్ పరిధిలోని పడకండ్ల -అహోబిలం ప్రధాన రహదారి పూర్తిగా జలమయం కావడంతో వాహనాల రాకపోకలు పూర్తిగా స్తంభించాయి. ఖరీఫ్ సాగుకు ఈ వర్షాలు ఎంతో అనుకూలంగా ఉన్నాయని రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఆళ్లగడ్డ మండలంలో 102.2 మి.మీ., చాగలమర్రి- 43.4, దొర్నిపాడు- 44.2, రుద్రవరం- 100.4, శిరివెళ్ల - 11.2, ఉయ్యాలవాడ మండలంలో 109.6 మి.మీ వర్షపాతం నమోదు అయినట్లు అధికారులు తెలిపారు.

సీసీఏ రూల్స్‌పై కలెక్టరేట్ ఉద్యోగులకు అవగాహన

నంద్యాల: ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఉద్యోగుల ప్రవర్తన నియమావళి, సీసీఏ, కండక్ట్ రూల్స్‌పై ప్రతి ఉద్యోగి సంపూర్ణ అవగాహన కలిగి ఉండాలని జాయింట్ కలెక్టర్ రాహుల్ కుమార్ రెడ్డి కలెక్టరేట్ సిబ్బందిని ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్ హాల్‌లో సీసీఏ రూల్స్, కండక్ట్ రూల్స్‌పై నిర్వహించిన అవగాహన సదస్సులో ఆయన పాల్గొని సిబ్బందికి పలు సూచనలు చేశారు. జిల్లా రెవెన్యూ అధికారి పద్మజ, అన్ని సెక్షన్ల సూపరింటెండెంట్‌లు పాల్గొన్నారు. ఈ సందర్భంగా జేసీ మాట్లాడుతూ.. ప్రభుత్వ ఉద్యోగి తన విధుల్లో విరుద్ధంగా ప్రవర్తించినా.. అతిక్రమించినా ఎలాంటి చర్యలు తీసుకోవాలి, విచారణకు అనుసరించాల్సిన విధివిధానాలపై క్షుణ్ణంగా తెలుసుకుని ఫైళ్లను సర్క్యులేట్ చేస్తే పైఅధికారులకు ఇబ్బందులు ఉండవని సూచించారు. గతంలో సీసీఏ రూల్స్ అతిక్రమించిన సిబ్బందికి విధించిన క్రమశిక్షణ చర్యల దస్త్రాలను పరిశీలించుకోవాలన్నారు. ప్రతి ఉద్యోగి హాజరు వేళలు, హాజరు రిజిస్టర్, కార్యాలయానికి ఆలస్యంగా హాజరవుట, పని వేళల్లో కార్యాలయాన్ని వదిలి వెళ్లిపోవుట, యాదృచ్ఛిక సెలవు, నిర్వహించాల్సిన రిజిస్టర్లు తదితర ప్రాథమిక సూత్రాలు తెలిసి ఉండాలన్నారు.



సూచనలు చేస్తున్న జాయింట్ కలెక్టర్ రాహుల్ కుమార్ రెడ్డి

పిడుగుపాటుకు గొర్రెల మృతి

రుద్రవరం: మండలంలో మంగళవారం తెల్లవారు జామున ఉరుములతో భారీ వర్షం కురిసింది. పెద్దశబ్దంతో గ్రామంలోని చింత చెట్టుపై పిడుగు పడింది. పిడుగుధాటికి చింత చెట్టు పైనుంచి కింద వరకు చీలింది. చింత చెట్టు కింద సేదతీరుతున్న రైతు వెంకటేశ్వర్లుకు చెందిన రెండు గొర్రెలు, రెండు మేకలు, మరో రెండు చిన్న పిల్లలు మృత్యువాత పడ్డాయి. దాదాపు రూ.60వేల వరకు నష్టం వాటిల్లిందని బాధిత రైతు వాపోయాడు. పశువైద్యాధికారి మనోరంజన్ ప్రతాప్ మృతి చెందిన జీవాలకు పోస్టు మార్టం నిర్వ హించారు.



ఎర్రగుడిదిన్నెలో పిడుగు పాటుకు చీలిన చింత చెట్టు



మృతి చెందిన గొర్రెలు

వెంకన్నకు విశేష పూజలు

నంద్యాల(వ్యవసాయం): స్థానిక సంజీవనగర్‌లోని రామాలయంలో లక్ష్మీవేంకటేశ్వరస్వామికి శ్రీభగవత్ సేవా సమాజ్ ఆధ్వర్యంలో అష్టాదళ పాదపద్మారాధన సేవ వైభవంగా నిర్వహించారు. ఉదయాన్నే స్వామి వారికి సుప్రభాతసేవ, పంచామృతాభిషేకాలు, ప్రత్యేక అలంకరణ చేసి భక్తులకు దర్శన భాగ్యం కల్పించారు. అనంతరం వేదపండితులు 108 బంగారు పుష్పాలతో అష్టోత్తరనామ కార్యక్రమాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించారు. మహామంగళ హారతులు ఇచ్చి భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు. కార్యక్రమంలో సూరయ్య, శ్రీనివాస్, మధుసూదన్ తదితరులు పాల్గొన్నారు.



ప్రత్యేక అలంకరణలో వేంకటేశ్వరస్వామి

అన్నా క్యాంటీన్ల ఏర్పాటుకు చర్యలు తీసుకోండి

- కలెక్టర్ శ్రీనివాసులు

నంద్యాల: జిల్లాలోని అన్ని మున్సిపాలిటీల్లో నిరుపేదలకు రాయితీపై ఆహారాన్ని అందించే అన్నా క్యాంటీన్ల ఏర్పాటుకు అవసరమైన చర్యలు తీసుకోవాలని కలెక్టర్ శ్రీనివాసులు మున్సిపల్ కమీషనర్లను ఆదేశించారు. మంగళవారం కలెక్టర్ క్యాంపు కార్యాలయం నుంచి మున్సిపల్ కమిషనర్లతో టెలీ కాన్ఫరెన్స్ నిర్వహించారు. అన్నా క్యాంటీన్ల ఏర్పాటుకు తీసుకుంటున్న చర్యలపై సమీక్షించారు. ప్రభుత్వ ఆదేశాల ప్రకారం జిల్లాలోని అన్ని మున్సిపాలిటీల్లో అన్న క్యాంటీన్ల ఏర్పాటుకు అవసరమైన భవనాలను ఎంపిక చేయాలన్నారు. గతంలో అన్నా క్యాంటీన్లు ఏర్పాటు చేసిన భవనాల్లో సచివాలయాలు, ఇతర ప్రభుత్వ భవనాలు ఉంటే వాటిని అనువైన ప్రదేశానికి షిఫ్ట్ చేయడానికి చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. వాటిని అన్నా క్యాంటీన్లకు వినియోగించుకునేందుకు అవసరమైన ఫర్నిచర్, విద్యుత్, టాయిలెట్స్ వంటి మౌలిక సదుపాయాలు ఏర్పాటుకు ఆర్థిక అంచనాలు రూపొందించి ప్రతిపాదనలు సమర్పించాలన్నారు.

లోక్ అదాలత్‌ను విజయవంతం చేద్దాం



సమావేశంలో మాట్లాడుతున్న ఐదవ అదనపు జిల్లా జడ్జి ఆర్‌వీవీఎస్ మురళీకృష్ణ

ఆళ్లగడ్డ: జాతీయ లోక్ అదాలత్ జాతీయ ఈ నెల 29వ తేదీన నిర్వహించనున్నందున విజయవంతం చేసేందుకు అందరం సమిష్టిగా కృషి చేద్దామని ఆళ్లగడ్డ ఐదవ అదనపు జిల్లా జడ్జి ఆర్‌వీవీఎస్ మురళీకృష్ణ పేర్కొన్నారు. మంగళవారం స్థానిక కోర్టు హాలులో పోలీసు అధికారులు, న్యాయవాదులుతో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రభుత్వం ప్రతిష్టాత్మకం చేపడుతున్న లోక్ అదాలత్‌లో వీలైనన్ని ఎక్కువ కేసులు పరిష్కరించడమే లక్ష్యంగా అందరూ కృషి చేయాలన్నారు. పెండింగ్ సివిల్, రాజీపడదగిన క్రిమినల్ కేసులతోపాటు వాహన ప్రమాదం, చెక్‌బౌన్స్, కుటుంబ తగాదాలు తదితర కేసులను పరిష్కరించుకోవచ్చని, ఇరువర్గాలకు అవగాహన కల్పించాలని సూచించారు. కక్షి దారులకు ఏదేని సందేహాలు ఉంటే మండల న్యాయ సేవా సంఘాన్ని సంప్రదివచ్చని సూచించారు. డీఎస్పీ షర్ఫుద్దీన్, సీఐలు రమేష్‌బాబు, హనుమంత నాయక్, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు సూర్యనారాయణరెడ్డి, సీనియర్ న్యాయవాది సోమశేఖర్‌రెడ్డి పాల్గొన్నారు.

మోడల్ స్కూల్‌లో ప్రవేశాలకు ఆహ్వానం

గోస్పాడు: స్థానిక ఏపీ మోడల్ స్కూల్‌లో ఖాళీగా ఉన్న సీట్లకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు స్కూల్ ప్రిన్సిపాల్ ఖాజాహుసేన్ తెలిపారు. 7వ తరగతిలో ఒకటి, 8వ తరగతిలో రెండు, 9వ తరగతిలో రెండు సీట్లు ఖాళీగా ఉన్నట్లు చెప్పారు. ఈ నెల 22వ తేదీ లోగా గోస్పాడులోని మోడల్ స్కూల్‌లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఈనెల 24వ తేదీ స్కూల్‌లో ప్రవేశ పరీక్ష ఉంటుందన్నారు.

కోచింగ్ సెంటర్లపై చర్యలు తీసుకోవాలి

నంద్యాల(న్యూటౌన్): డీఎస్సీ పేరుతో నిరుద్యోగులను మోసం చేస్తున్న కోచింగ్ సెంటర్లపై చర్యలు తీసుకోవాలని డీవైఎఫ్ఐ నాయకులు శివ, వంశీ అధికారులను కోరారు. డీఎస్సీ నోటిఫికేషన్ రావడంతో దీన్ని ఆసరా చేసుకుని పలు కోచింగ్ సెంటర్ల యజమానులు ఎంతో మందికి ఉద్యోగ అవకాశాలు కల్పించామంటూ మభ్యపెడుతూ అధిక ఫీజులు వసూలు చేస్తున్నారని ఆరోపించారు. సరైన ఫ్యాకల్టీ లేక నిరుద్యోగులు నిరాశ పడుతున్నారన్నారు. నిరుద్యోగులను మోసం చేస్తున్న కోచింగ్ సెంటర్లపై చర్యలు తీసుకోవాలని కోరారు.

వాల్మీకులకు న్యాయం చేయాలి



మాట్లాడుతున్న వాల్మీకి సంఘం నేత పులికొండన్న

నంద్యాల(అర్బన్): వాల్మీకుల ఎస్టీ పునరుద్ధరణ బిల్లును పార్లమెంట్‌లో ఆమోదం పొందేలా తెలుగుదేశం ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని ఎంవీఆర్‌పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు పులికొండన్న, అధికార ప్రతినిధి పవన్‌గోపాల్ కోరారు. ఆ సంఘం కార్యాలయంలో మంగళవారం ముఖ్య నాయకులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. 2017లో ముఖ్యమంత్రిగా ఉన్న చంద్రబాబునాయుడు ఎస్టీ పునరుద్ధరణ బిల్లు పార్లమెంట్‌కు పంపారన్నారు. బిల్లులో సవరణలు చేపట్టాలని కేంద్రం బిల్లును వెనక్కి పంపిందని, 2024లో మరోమారు రాష్ట్రంలో టీడీపీ ప్రభుత్వం అధికారంలోకి రావడంతో వాల్మీకులకు న్యాయం జరిగేలా పునరుద్ధరణ బిల్లును ఆమోదింపజేయాలని కోరారు. నాయకులు జయరాం, మధుగోపాల్, రాజునాయుడు తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా స్వాతి వేడుకలు

నంద్యాల(వ్యవసాయం): పట్టణంలోని తెలుగుపేటలో వెలసిన మద్దిలేటి లక్ష్మీనరసింహస్వామి దేవస్థానంలో మంగళవారం స్వామివారి జన్మనక్షత్రం స్వాతి వేడుకలను వైభవంగా నిర్వహించారు. వేకువ జామున సుప్రభాత సేవతో స్వామివారిని మేల్కొలిపి పంచామృతాభిషేకాలు, స్నపన తిరుమంజనం, పట్టువస్త్రాల అలంకరణ చేశారు. అనంతరం భక్తులకు దర్శనం కల్పించారు. అదే విధంగా లక్ష్మీదేవికి ప్రత్యేక పూజలు, సామూహిక కుంకుమార్చనలు నిర్వహించారు. మహానైవేద్యం సమర్పించి స్వామి, అమ్మవార్లకు మహామంగళ హారతులు ఇచ్చారు. సాయంత్రం స్వాతి పల్లకీసేవ సమితి ఆధ్వర్యంలో స్వామి, అమ్మవార్లను ఊరేగించారు. కార్యక్రమంలో ఆలయ నిర్వాహకులు మధుసూదనరాయల్, అర్చకులు రామ్మూర్తి పాల్గొన్నారు.



ప్రత్యేక అలంకారంలో మద్దిలేటి లక్ష్మీనరసింహస్వామి

అంగన్‌వాడీ వర్కర్ల సమస్యలు పరిష్కరించాలి

నంద్యాల(న్యూటౌన్): అంగన్‌వాడీ కార్యకర్తలు, సహాయకుల సమస్యలు పరిష్కరించాలని సీఐటీయూ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ఏసురత్నం, నాగరాజు కోరారు. మంగళవారం నంద్యాలలోని సీఐటీయూ కార్యాలయంలో సేబారాణి అధ్యక్షతన సమావేశం జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. అంగన్‌వాడీ కార్యకర్తలకు కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలని, ఉద్యోగ భద్రత కల్పించాలని డిమాండ్ చేశారు. రిటైర్‌మెంట్ బెనిఫిట్స్ కల్పించి సగం పెన్షన్ ఇవ్వాలని కోరారు. అంగన్‌వాడీ సెంటర్లకు ట్రాన్స్‌పోర్టు చార్జీలు, మెను చార్జీలు పెంచాలన్నారు. సమావేశంలో నిర్మలమ్మ, వెంకటలక్ష్మి, రమణమ్మ, సునీత, నాగరాణి, సరస్వతమ్మ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఏసురత్నం

నీట్ అవకతవకలను నిగ్గు తేల్చాలి

నంద్యాల(న్యూటౌన్): వైద్య సీట్ల భర్తీకి నిర్వహించే నీట్‌లో అవకతవకలపై నిగ్గు తేల్చాలని వైఎస్సార్‌సీపీ విద్యార్థి విభాగం రీజనల్ కో ఆర్డినేటర్ సన్నల సాయిరాంరెడ్డి ఒక ప్రకటనలో ప్రభుత్వాన్ని కోరారు. ఈ ఏడాది జరిగిన నీట్ పరీక్షల్లో పేపర్ లీకేజీతో పాటు మార్కులు కలపడం వంటివి జరిగిందన్నారు. 24 లక్షల మంది విద్యార్థులు పరీక్షలు రాశారని, ఇలా జరగడం దురదృష్టకరమన్నారు. దీనిపై ప్రధాని, ఆరోగ్యశాఖ మంత్రి స్పందించాలని కోరారు. సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపి బాధ్యులను కఠినంగా శిక్షించాలని, భవిష్యత్తులో ఇలాంటి సంఘటనలు జరగకుండా చూడాలని కోరారు.

దేవాలయాల భూముల వేలంపాట

ఉయ్యాలవాడ : స్థానిక అగస్త్యేశ్వర, కోదండ రామస్వామి ఆలయ భూములు ఏడాది కౌలు సాగుకు మంగళవారం స్థానిక అగస్త్యేశ్వర స్వామి ఆలయంలో దేవదాయశాఖ కార్యనిర్వాహణాధికారి చంద్రుడు ఆధ్వర్యంలో వేలంపాట నిర్వహించారు. ఆలయాలకు సంబంధించి 51 ఎకరాలకు వివిధ గ్రామాల రైతులు రూ. 2.22 లక్షలకు దక్కించుకున్నారు. గతేడాదితో పోలిస్తే కౌలు వేలం ద్వారా రూ. 42 వేలు ఆదాయం పెరిగిందని ఈఓ స్పష్టం చేశారు. కార్యక్రమంలో బనగానపల్లె డివిజన్ దేవాలయాల ఇన్‌స్పెక్టర్ హరిశ్చంద్రారెడ్డి, వైఎస్ఆర్‌సీపీ, టీడీపీ మండల కన్వీనర్లు బుడ్డా చంద్రమోహన్‌రెడ్డి, బోరెడ్డి రాజశేఖర్‌రెడ్డి, ఆలయాల మాజీ ధర్మకర్తలు పోచా రాధాక్రిష్టారెడ్డి, ఖాతా దస్తగిరిరెడ్డి, ముసాని శివరామిరెడ్డి, సాగునీటి సంఘం మాజీ అధ్యక్షుడు ఆకుల చిన్నవెంకటసుబ్బయ్య, అర్జిగారి నరసింహుడు, కేశిరెడ్డి నాగేశ్వరరెడ్డి తదితరులు పాల్గొన్నారు.



భమూలు వేలం పాట నిర్వహిస్తున్న దేవదాయశాఖ అధికారులు

వైభవంగా అష్టాదళ పాదపద్మారాధన సేవ

నంద్యాల(వ్యవసాయం): పట్టణంలోని గాంధీచౌక్‌లో వెలసిన కాళికాంబ చంద్రశేఖర దేవస్థానంలో అమ్మవారికి మంగళవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. మూల విరాట్‌కు ఉదయాన్నే సుప్రభాత సేవ, పంచామృతం, నిమ్మ, వేప రసాలతో అభిషేక పూజలు చేశారు. అనంతరం అమ్మవారిని పట్టు వస్త్రాలతో అలంకరించి వివిధ రకాల పూలతో పూలంగి సేవ నిర్వహించారు. అమ్మవారికి వడి బియ్యం కార్యక్రమం నిర్వహించి, 108 వెండి పుష్పాలతో అష్టాదళ పాదపద్మారాధన సేవ.. మహామంగళ హారతులు ఇచ్చారు. భక్తులు అమ్మవారిని దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు. కార్యక్రమంలో ఆలయ ఈఓ లక్ష్మీనారాయణ, ఆరవేటి వాసు, విజయ్ కుమార్ తిమ్మయ్య, నరసింహ పాల్గొన్నారు.



పూజలందుకున్న అమ్మవారు



ప్రకృతి అందాల నడుమ మహానంది ఆలయం

మంచు కురిసి.. ప్రకృతి పరవశించి

మహానంది: నల్లమలలో వెలసిన మహానంది ఆలయం మహానందానికి నిలయం. ఆధ్యాత్మిక కేంద్రంగా విరాజిల్లుతున్న మహానంది పుణ్యక్షేత్రం పరిసరాలు వరుసగా కురుస్తున్న వర్షాలతో పచ్చగా కళకళలాడుతూ భక్తులను విశేషంగా ఆకట్టుకుంటున్నాయి. దీంతో పాటు ఉదయం వేళలో మంచు కురుస్తుండటంతో ఊటిని తలపిస్తోంది.

కుమారస్వామికి విశేష పూజలు

శ్రీశైలంటెంపుల్: శ్రీశైల శ్రీభ్రమరాంబా మల్లికార్జున స్వామివార్ల ఆలయ ప్రాంగణంలోని కుమారస్వామి ఉపాలయంలో మంగళవారం ఆలయ అధికారులు, అర్చకులు విశేష క్రతువులను నిర్వహించారు. కుమారస్వామికి అభిషేకము, సుబ్రహ్మణ్య అష్టోత్తరము చేసిన అనంతరం స్తోత్రపారాయణాలు చేశారు.